

# "జనార్ధనం"

సోమంచి రామం

సమితి ఆఫీసుకు ట్రాన్స్ఫరయి వచ్చిన ఎల్. డి. సి. భాస్కరరావు. మన జనార్దనరావు ఒకేసారి జాయినయారు ... అంతకు పూర్వం యిద్దరికీ సుఖపరిచయముండిగాని స్నేహంగా మారేటంత చనువుకలగలేదు ..కొత్తగా సమితులు యేర్పడ్డంతోటే యీ యిద్దర్నీ ఆ పరమాత్ముడే పరిషత్తు అధ్యక్షుడి రూపంలో సాక్షాత్కరించి ఒకే సమితికి గుమాస్తాలుగా ట్రాన్స్ఫరు చేశారు... చేరిన కొద్ది రోజులకే యిద్దరికీ యెంతో చనువు యేర్పడింది...చనువు క్రమంగా స్నేహంగా మారి పోయింది ... యిద్దరూ యెంతో అన్యోన్యంగా ఉండసాగారు ... వీళ్ళ స్నేహంచూస్తే తోటి గుమాస్తాల్లో చాలమందికి అసూయలాంటి భావం అప్పుడప్పుడు కలుగుతూ ఉండేది ... వీరిద్దరు యెంత సన్నిహితంగా కలిసి తిరుగుతూ ఉండే వారో—అంత భిన్నంగానూ ఉండేవి వాళ్ళ మన స్తత్వాలు ! ఇద్దరివీ రెండురకాల మన స్తత్వాలు—భాస్కరం—ముద్దుకి అలానే పిలిచేవారంతా !—ఒళ్ళు దాచుకొనే మనిషికాదు - అలాగని ఒళ్ళు అలిసిపోయేలాపడి గొడ్డులా పనిచేసేరకంకాదు- ముక్తసరిగ టంచనుగ గడియారం గంటలు కొట్టి నట్టుగ తనపని నీటుగ, ప్రాంప్టుగ చేసికొనిపోయే వాడు - అతని పనిలో యెప్పుడూ ఢీలేగాని, బకాయిగాని ఉండవు... ఎంత హెవీ వర్కయినా సూక్ష్మగ్రాహ్యతతో యిట్టే ఫినిష్ చేసేసి బి.డి.ఓ. మెప్పు పొందేవాడు...ఇక జనార్దనం-సరేసరి- అందరికన్న ముందే హాజరు ఆఫీసుకు :- ఓవర్ టైము వర్కుచేసినా యింకా కాగితాలు పెండింగులోనే ఉంటాయి.

"వాట్ ! మిష్టర్ జనార్దనం ఈ మంత్ రిటర్న్స్, 15 కల్లా డిస్పాచ్ అయిపోవాలని చెప్పానుగదా ! యింతవరకూ ఆఫీసు కాపీ..." అంటూ మెత్తగా చీవాట్లు పెట్టేవాడు బి. డి. ఓ.

"అయిపోయింది సార్ !... ఫినిష్ అయి పోయింది..." అంటూ నసిగేవాడు జనార్దనం.

"ఏమిటి ఫినిష్ అయింది? ఆఫీసు కాపీయేనా?" తిరిగి కోపంతో కళ్లెర్రచేస్తూ చూసేవాడు బి.డి.ఓ.

"ఎస్! సార్ !... ఇంకొక్క ఐటెమ్ మిగిలి పోయిందంతే !...దాంతో ఆఫీసు కాపీ ఫినిష్ అయిపోతుంది..." అంటూ నీళ్ళు నమిలేవాడు 17 వ తారీఖున!

"నీ కంతగా క్విక్ నెస్ లేకపోతే ఆ భాస్కరం హెల్ప్ తీసికోరాదూ?" అని మందలించే వాడు బి. డి. ఓ.

ఇది భాస్కరం, జనార్ధనంల ఆఫీసు వర్కు వ్యవహారం !

ఇక అంతరంగిక వ్యవహారం :

జనార్దనంకూడ ఒక సామాన్య కుటుంబంనుంచి వచ్చినవాడేనని మొదట్లో అంతా అభిప్రాయ పడ్డారు ... చాలా మంది యన్. జి. ఓ.ల్లాగ యల్. డి. సి. ల్లాగ అతనికీ ఒక ఓ ముసలి తల్లి తండ్రి. పెళ్ళికావాల్సిన చెల్లెళ్లు, చదివించుకోవా ల్సిన తమ్ముళ్ళు, రోగిష్టి భార్య ఎట్సెట్రా-బాదర బందీ అంతా ఉండి ఉంటారని ఊహించారంతా! భాస్కరం కూడా అలాగే అభిప్రాయపడ్డాడు. .కాని ... తర్వాత తర్వాత తెలుసుకున్నాడు. తన ఊహ అంతా తప్పని ! - తనకి మల్లే జనార్ధనానికి వెనక బాదరబందీ యేమీ లేదని ! తండ్రికి డబ్బు పంపా ల్సిన అవసరం తనకిమల్లే జనార్దనానికిలేదు- పైపెచ్చు జనార్దనం తండ్రిదగ్గరే వుండడంచేత తండ్రి సంసారం ఖర్చంతా సరిచూస్తూ ఉంటాడు. తనకి మల్లే తమ్ముళ్ళను చదివించవలసిన అవ సరంలేదు, పైగా జనార్ధనం తమ్ముళ్ళంతా చదు వులు పూర్తిచేసేసి ఉద్యోగాల్లో ఉన్నారు .... అంతేనా తనకుమల్లే జనార్దనానికి పిల్లలు - అధిక సంతానంలేదు - తనకేమో అయిదుగురు పిల్లలు- జనార్దనానికి ముగ్గురు - అంతే ముందు జాగ్రత్త పడ్డాడు, తిరగేసిన ఎర్ర త్రికోణాన్ని ఆరాధించి ఆహ్వానించాడు - అయితే ఇక 'అతనికీ తనకు ఏమిటి పోలిక ? - ఏముంది ? ... ఒక్కటే...

ఇద్దరు ఒకే ఆఫీసులో ఎల్. డి. సి. లు ! ... తనతండ్రి తదనంతరం తనకు మిగిల్చిపోయింది

ఆ స్త్రీమాట యేలావున్నా- ఏ అయిదారు వందలో తన వాటాకు అప్పు- అది మాత్రం ఖాయంగా తెలుస్తోంది. భాస్కరానికి! మరి జనార్ధనానికి- అతని వాటాకి అయిదారెకరాలు వస్తుందని ఆ మధ్య యెప్పుడో అతనే చెప్పాడు! కాబట్టి ఏ విధంగాచూచినా తనకన్నా ఎన్నోరెట్లు జనార్ధనం ఆర్థికంగా మెరుగనే నిర్ణయానికొచ్చాడు భాస్కరం! పోటీ గుమస్తా కాబట్టి- అలాటివాడు తమకు అవసరం కలిగినప్పుడు ఆదుకుంటాడని ఆశించాడు అంతా!- తప్పేముంది? ఏ నెలయినా పొరపాటున జీతాలు ఆలస్యంగా వచ్చినా ఉన్ని పది. పదిహేను మంది గుమాస్తాలకు తలో పదో పరకో అవసరానికి సర్దగల స్తోమత జనార్ధనానికి ఉదంని ఒప్పుకోక తప్పదు!- ఇవంతా జనార్ధనాన్ని గూర్చి జనాభిప్రాయమేగాని - జనార్ధనంయొక్క స్వంత అభిప్రాయాలు ఇంతవరకు వెల్లడి చేయనేలేదు!

ఉద్యోగం పురుషలక్షణం అనిగాని- ఉదర పోషణార్థం ఉద్యోగం అనిగాని- నేను తలంపటం లేదు-చిన్నయసూరి నీతిచంద్రికలో చెప్పినట్లుసంపాదనే నా లక్ష్యం!- ఇంత సంపాదించితిమి గదాయని తనియరాదు! అర్థము పురుషార్థములకెల్ల ఉత్తమము! అదే నా లక్ష్యం!- డబ్బులేనివాడు దుబ్బుకు కొరగాడు! కట్ట లేని వానిని గొడ్డె కూడ కరచు—నా సిద్ధాంతంలో-డబ్బు గలవానికి దేవుడే వెరచు— అందుకని - ఆ దేముడే మేలుచేస్తే - యీ యేడు యింకో కుంట పొలం కొనిపారేయాలి! - యివీ జనార్ధనం స్వంత, స్వతంత్ర భావాలు - ఆర్థిక సూత్రాలు! అప్పుడప్పుడు అప్రయత్నంగా వీటినే బయటకు చెప్పేవాడు! అదృష్టం కలసిరాలేదుగాని భారతదేశ ఆర్థిక మంత్రిత్వశాఖను అలంకరించే అవకాశం తనకు లేకపోలేదని జనార్ధనం అంతరాత్మ అప్పుడప్పుడు ఘోషిస్తూనే ఉంటోంది(ట)!

* * *

"జనార్ధనం!... జనార్ధనం!!... అర్జంటుగా ఓ పదిరూపాయలు సర్దాలి బ్రదరూ! ... మా ఆవిడను ఆస్పత్రిలో చేర్చాను...డెలివరీ-ఇంజెక్షన్లుకొనాలి. చాల సీరియస్‌గా ఉంది! ప్లీజ్..." అంటూ ఓనాటి మధ్యాహ్నం రెండుగంటల సమయంలో జనార్ధనం సీటుదగ్గర నిలబడి ప్రాధేయపడుతున్నాడు ప్రకాశం డిస్పాచ్ క్లర్క్!

ప్రక్క సీట్లోనే కూర్చున్న భాస్కరానిక్కి ఎందుకో గుండె దడదడ లాడింది!- పేదాదికితం తన భార్య అయిదోసారి పురుడు పోసుకున్నప్పుడు ఆమె-తాను పడ్డ బాధ-ఆమ్మో-పగవారికికూడా వద్దు భగవాన్ అనుకున్నాడు!- అంతే!- ఆఫీసు నోటు వ్రాస్తున్న అతని కలం మొరాయించింది!- ఆగిపోయింది!-

జనార్ధనం తల పైకెత్తి ప్రకాశంకేసి చూశాడు.

"ప్లీజ్!...అర్జంటు!-" ప్రకాశం యింకా బ్రతిమాలుతూనే ఉన్నాడు!

"పదా!..." అన్నాడు తాపీగా జనార్ధనం!

"పది చాలు జనార్ధనం!- జీతంలో డిటక్ట్ చేసికొందువుగాని -"

—వాపసు యిచ్చే గ్యారంటీ చెప్తున్నాడు ప్రకాశం-యిస్తున్నాడేమోనన్న ఆశతో!-

"పొద్దున్నే ఆఫీసుకు రాగానే అడక్కపోయావా మిష్టర్?...యింత క్రితమే-" అంటూ ఏమో చెప్ప బోయాడు జనార్ధనం!

బుస్సలా కూలిపోతూ ప్రకాశం!- కొండంత ఆశ పెట్టుకున్నాడు-ఆ ఆశ కాస్త నిరాశయ్యేసరికి- ఏమి ఎరగనట్లు ప్రాతలో మునిగిపోయాడు జనార్ధనం!

భాస్కరం గమనిస్తూనే ఉన్నాడింతా!- అతని మనస్సు ద్రవించిపోయింది!. వ్రాస్తున్న నోట్‌మీద పేపరు వేయిట్ పెట్టి లేచాడు - గబగబా జనార్ధనం సీటుదగ్గరకొచ్చి ప్రకాశాన్ని లేవతీశాడు.

"ఇలారా!...ప్రకాశం!...నేనుసర్దుతాను..." అంటూ అడుగు ముందుకేశాడు!

ప్రకాశం కళ్ళు ఆనందంతో మెరిశాయి— చెమర్చాయి..."నీ మేలు మర్చిపోలేను భాస్కరం! పిల్లలుగలవాడివి నీ దగ్గర ఉండదేమో — నెలచివర కదాని — భయపడి అడగలేదు..." అంటూ కృతజ్ఞతతో అతన్ని చుట్టేసుకున్నాడు!

భాస్కరం పాంటు జేబులోనికి చెయ్యిపోనిచ్చాడు! చేతికి రెండు అయిదుకాగితాలుతగిలాయి.

ముసలిదంపతులిద్దరూ తీవ్రంగా దెబ్బలాడుకున్నారు. చివరకు ముసలామెకు విసుగుపుట్టి "నాకు చావైనా రాదేమిరా దేవుడా" అంటూ ఏడ్చింది.

"ఓ దేవుడా! నన్ను సారాకొట్లో పడేయ్‌రాదూ" అన్నాడు ముసలివాడు.

"ఆయన్ను సారాకొట్లో పడేస్తే, నన్ను తమలపాకుల తోట్లో పడెయి" అందామె. ఆమెకు తంబాకు నమిలే అలవాటుంది.

ఆ రెండు ప్రకాశం చేతిలో పెట్టి అతన్ని పంపించేశాడు...ప్రకాశంథేంక్సుచెప్పి పి.డి.ఒ పర్మిషన్ తీసికొని వెళ్ళిపోయాడు!-

"ఇంతే! మనుష్యుల తత్వం! ... ఈ డబ్బే ఈతన్ని రక్షిస్తుంది గాబోలు!" - అన్నట్లు జనార్ధనకేసి చూసి తన సీట్లో కూర్చుని పని చూసుకోసాగాడు భాస్కరం!

"ఇంతే మనుష్యుల తత్వం!... ఈతనికి డబ్బు విలువ తెలియదు!- పిచ్చివాడు! ... అతగాడు ఈ పది రేపు జీతాల్లో ఎలా యివ్వగలుగుతాడు?... ఇవ్వలేకపోతే మనం ఎలా అడగ్గలుగుతాము?... మొహమాటపడి అడక్కపోతే-యెన్నాళ్ళికి అతనివ్వకపోతే- కాలక్రమంలో ఆ పదిరూపాయలకు మనం నీళ్ళు వదులుకోవల్సిందేగా!... ఇలాగే పదిమందికి పదేసి చొప్పున యిస్తే - వంద! ఆ వంద ఒక్క నెల ఆలస్యమయితే వడ్డీ ఒక్కరూపాయి దండగ! అదే రెండు నెలలయితే రెండు రూపాయలు - అయినా యితగాడికి యిచ్చేది చేబదులు- అంటే చేతికి యిచ్చేది. రాతాకోతా లేవు! గుర్తుండి ఇస్తే సరిగ్గి యివ్వటం!- లేకపోతేలేదు!- ఆధారం ఉండదుగాబట్టిఅడిగేహక్కు ఉండదు!-ఇన్నిచిక్కులు పడదంకన్నా-" అంటూ తనకితనే సమాధానం చెప్పుకుని భాస్కరం కేసి జాలిగా ఓ చూపుచూసి తనపనిలో మునిగిపోయాడు జనార్ధనం!

* * *

రోజులు గడిచిపోతున్నాయి. కాలం ఆగుతున్నా ఆగడుగా! మనుష్యుల వయస్సు కాలంతోపాటు పెరగవచ్చుగాని-మనుష్యుల-తత్వం-పెరగాలంటే— మాటలా? - అది అందరి విషయంలోను సాధ్యం కాకపోవచ్చును! జనార్ధనం విషయమూ అంతే— పోటీ గుమాస్తాలంతా యు. డి. సి. కోసం టెస్టులకు కట్టున్నారు- అందుకోసం పదులు పాతికలు- ఖర్చుపెట్టి పుస్తకాలు — పేపర్లు కొని కష్టపడుతున్నారు-మని జనార్ధనం మాత్రం ఆ పంపే చేయదంలేదు.కారణం యు. డి. సి. ప్రమోషన్ అక్కర్లేక కాదు - ప్రమోషన్ వస్తే అందరికన్నా ముందు తనకే రావాలని మాత్రం ఉంది! అయితే ఆ టెస్టుకోసం ఖర్చుయెందుకు పెట్టాలా అని!

ఈ యేడు పై సంపాదనతో యింటి ఖర్చు గడిచేస్తే, జీతం రాళ్ళను వడ్డీకి తిప్పి యేడాది ఆఖరుకు ఓ కుంట పొలం కొనెయ్యొచ్చు! — ఇదీ అతని ఊహ! అందుకే భాస్కరం, రామారావు, సత్యంలు టెస్టు పాసయినా తన ప్రసక్తే తలపెట్టలేదు. వాళ్ళ పుస్తకాలు, పేపర్లు యిమ్మని అడిగాడు - జనార్ధన్‌తత్వం గ్రహించిన సత్యం వాటిని అన్నిటిని అంతకు ముందే యింకెవరికో యిప్పించేశాడు! ఇది టెస్టు తాలూకు భాగవతం! ఇక మధ్యాహ్నం సమయంలో తీసికొనే టెస్ట్ - లంచ్ విషయం చూద్దాం - రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకు గుమస్తాలంతా కలిసే కాంటీన్‌కు వెడతారు! మన జనార్ధనం మాత్రం వాళ్ళతో కలిసి వెళ్ళడు. ఓ చిన్న టిఫెన్ ఇంటిదగ్గరనుండి తెచ్చుకున్న ఓ చిన్న ఉద్దా ముక్కో. ఓ చిన్నరొట్టె ముక్కో తిని. ఓ గుక్కెడు మంచినీళ్ళు త్రాగుతాడు! అప్పుడప్పుడు ఏ పార్టీయన్నా తగిలితే - వారు యిప్పిస్తే - కాఫీ త్రాగుతాడు! సిగరెట్టు కూడ పార్టీ పెట్టుకోవాల్సిందే. సాధ్యమైనంత వరకు నెల పొడుగునా యిలాగే గడుపుతాడు! సమితి ఆఫీసుకు దగ్గర్లోనే జనార్ధనం ఊరు. ఇంటి అద్దె లేదు. స్వంత బాధ్యతలూ లేదు! పైన చూసి పెట్టేందుకు తండ్రివున్నాడు! - నెలఖర్చుకి ఒకరవప్పో డబ్బుయిస్తే తన వాటాయిస్తే అంతా తండ్రి నిర్వహిస్తాడు! అయినా జనార్ధనానికి యింకా ఏదో లోటుగానే వుంటోంది.

* * *

ఆ రోజు ప్రకాశానికి అప్పుగా యిచ్చిన ఆ రెండు అయిదు కాగితాలు యింట్లో బియ్యానికోసం యెక్కడో అప్పు తెచ్చుకున్నాడు భాస్కరం!- ఆ రాత్రి బియ్యంలేక ఆ కుటుంబం పస్తుపడుకున్న విషయం జనార్ధనానికేం తెలుస్తుంది?- అయినా అందులో ఉన్న ఆత్మతృప్తి, ఆత్మానందం - భాస్కరంలాటి కష్టజీవులకు అర్థమవుతుందిగాని

అనాక్సింలాటి వాళ్ళకేం తెలుస్తుంది?

భాస్కరం ధర్మమా అంటూ సమయానికి సహాయపడిన ఆ పది రూపాయలు ప్రకాశం సంసారాన్ని నిలబెట్టాయని చెప్పక తప్పదు.

ప్రకాశం భార్య సుఖంగా ప్రసవించింది.

మరో ఎల్. డి. సి. ని ప్రసాదించింది. తన మనఃపూర్వక కృతజ్ఞతలు తెల్పుకున్నాడు ప్రకాశం భాస్కరానికి. అంతకన్నా ఆనందం ఏముంటుంది భాస్కరానికి. ఆ మధుర ఘట్టం చూచి ఈర్ష్య చెందాడు జనార్దనం.

"కావాలంటే యిలాటి బీదవాళ్ళకు వంద మందికి తలోవందా పారెయ్యగలను. తలుచుకుంటే తెలుసా మనసా...." అనుకున్నాడు జనార్దనం.

* * *

ఆరోజు గుమాస్తాల ముఖాలన్నీ సంతోషాతిశయంతో వెలిగిపోతున్నాయి - కారణం - జీతాలు చేతికొచ్చేరోజు కావటమే. సాయంత్రం జీతాలు యిస్తున్నారు. ఈలోగా ఎవరి సీట్లోవాళ్ళు కూర్చుని మంత్లీ బడ్జెటు వేసికొంటున్నారు.... జనార్దనం కూడా లెక్కవేశాడు. చింపేశాడు - మళ్ళీ వేశాడు- మళ్ళీ చింపేశాడు. ఎన్నిసార్లు లెక్కేసినా అయిదు తక్కువవుతోంది. ఏమిటి? అయిదు రూపాయలు.

దేనికి? వంద కాగితానికి - అంటే తనకొచ్చే జీతంలో యింటి ఖర్చుకింద తండ్రికిచ్చేదిపోను. చిలర ఖర్చులకు మినహాయించేయగా 95 రూ॥లే మిగుల్తోంది. ఎవరికేనా నోటుగా యిద్దామా అంటే 100 రూ॥లు పూర్తికావటంలేదు. ఏ ఖర్చు తగ్గిద్దామన్నా- అక్కడికీ చాల తగ్గించేశాడు- ఎలాగ?- ఆ అయిదూ ఎవరేనా యీ నెలకు యిస్తే- పోనీ- భాస్కరాన్నే అడిగితే- ఎలా వుంటుంది?- అలా ఆలోచిస్తూ కూర్చున్న జనార్దనం కళ్ళబడింది ఓ అయిదు కాగితం. ఆఫీసులో నేలమీద! ఆశ్చర్యం! వెంటనే లేవాడు. చడీచప్పుడుకాకుండ చేతిలో ఏదో ఫైల్ పుచ్చుకున్నాడు. గబగబా నడిచివెళుతూ ఆ ఫైల్‌ని జారవిడిచేశాడు- ఎక్కడ? అయిదు కాగితంమీద! అంతే- "అరెరే!" అంటూ యేమీ యెరగనట్లు వంగుని ఆ ఫైలు తీసికొన్నాడు- వట్టి ఫైలుకాదు- అయిదు రూపాయలు కూడ అంటిపెట్టుకున్న ఫైలు బి. డి. ఓ గారి దగ్గరకెళ్ళబోయి తిరిగి సీట్లో కొచ్చేశాడు.

"హమ్మయ్య! వంద పూర్తయింది! - గమళ్ళ గురవయ్య అడిగాడు- ఓ వందుంటే సర్దండీఅని- యీ వేళ కబురంపి రూపాయి చొ॥న రాయించేసుకొని యిచ్చేయాలి!" అనుకొంటూ ఆలోచిస్తున్నాడు జనార్దనం.

ఆ ప్రక్కనే—

"లేదు - భాస్కరం! సరిగ్గానే లెక్కపెట్టుకున్నాను! నూట యిరవై అయిదు రూపాయలు జీతం లెక్కపెట్టే యిచ్చారు అఫీసరుగారు! అన్నీ పదులే! - మూడే అయిదులు! రెండు అయిదులూ పిల్లకిచ్చేద్దామని చేత్తో పుచ్చుకుని యిలాగే వచ్చాను..." అంటూ జాలిగ వేలగ. కళ్ళనీళ్ళ పర్యంతం రాగ ప్రకాశం అంటున్న మాటలు జనార్దనానికి వినిపించకపోలేదు గాని - ధన మూలమిదంజగత్!

"పోనీ ప్రకాశం!- యీ అయిదూ చాల్లే!- మిగతా అయిదు పైనెలలో యిద్దువుగానిలే!- ఏం చేస్తాం?- ఎక్కడపోయిందో?- మనకు ప్రాప్తంలేదు" అంటూ ఓదార్చాడు భాస్కరం.

"అంతేనా! భాస్కరం!- ఆ!... అయిదూ!..." అంటూ జాలిగా చుట్టూచూశాడు ఒక్కసారి ప్రకాశం!

అలా చూడ్డంలో ప్రకాశం చూపులు జనార్దనం మీద పడేసరికి- అప్రయత్నంగా తలదించేసుకున్నాడు జనార్దనం- పచ్చకాగితం పూర్తయిందన్న సంతోష పాపంతో!

★

## పల్లెలో దీపావళి



ఫోటో : మారేమండ శ్రీనివాసరావు